COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
తేది : 1 ఫిబ్రవరి, 2019.

## రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చింది. ప్రత్యేక హెూదా ప్రస్తావన లేదు. విభజన హామీల అమలుకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కేవలం ఎన్నికల్లో రాజకీయ అవసరార్థం కన్నీటి తుడుపుగా కొన్ని పథకాలు ప్రకటించి చేతులు దులుపుకుంది. దీన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా నిరసిస్తున్నది. నేడు రాష్ట్ర బంద్‌లో ప్రజలు వివిధ రూపాలలో నిరసన తెలిపారు. ఈ ఆగ్రహాన్ని హెూదా సాధించుకునేంత వరకు కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

రాష్ట్రానికి విభజన హామీల అమలు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు లేవు. రైల్వే జోన్ గురించి గానీ, కొత్త రైల్వే లైన్లు గురించి గానీ ప్రస్తావన లేదు. మొత్తంగా ఈ బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. మరోసారి మోడీ ప్రభుత్వం తెలుగు ప్రజలకు ద్రోహం చేసింది.

దేశంలో తీవ్రమవుతున్న వ్యవసాయ సంక్షోభాన్ని నివారించే చర్యలు ప్రతిపాదించలేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించినా దేశంలోని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కలేదు. దేశవ్యాప్తంగా రైతులు రుణమాఫీ డిమాండ్ చేస్తున్నారు. వారి ఘోష పట్టించుకోలేదు. గత నాలుగున్నరేళ్ళలో రైతుల ఆత్మహత్యలు నివారించడంలో విఫలమైన బిజెపి ప్రభుత్వం కంటితుడుపు చర్యగా 5 ఎకరాలలోపు రైతులకు సంవత్సరానికి రూ.6000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ ఎన్నికల జిమ్మిక్కులను రైతులు విశ్వసించరు. ఇది వ్యవసాయ సంక్షోభాన్ని, రైతుల ఆత్మహత్యలను ఏ మాత్రం పరిష్కరించలేదు. మోడీ ఇచ్చే రూ.6000 పెరుగుతున్న డీజిల్ రేట్లకు కూడా సరిపోదు. మోడీ ప్రభుత్వం కనీసం 10 వేల రూపాయల సహాయం ప్రకటిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

ధరల నియంత్రణ చేశామని, అవినీతిని అరికట్టామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. మోడీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అడ్డులేకుండా పోయింది. పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్‌టి పేరుతో అన్ని రకాల వస్తువులు, సేవల ధరలు పెరిగాయి. నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థనే దెబ్బతీసిన మోడీ ప్రభుత్వం అవాస్తవాలతో వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. నీరవ్‌మోడీ లాంటివారు బ్యాంకులకు పెద్దయెత్తున డబ్బులు ఎగ్గొడుతున్న కేసులు పెరిగాయి.

అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ ఇస్తామంటూనే వారిపైనే బీమా భారాన్ని మోపింది. దేశవ్యాప్తంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ప్రకటించారు. కొత్త ఉద్యోగాలు లేవు సరికదా ఉన్న ఉద్యోగాలకే మోడీ ప్రభుత్వం ఎసరు పెట్టింది. నోట్లరద్దు వల్ల దాదాపు కోటి 10 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. గత 45 ఏళ్ళలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ సమస్య పెరిగిందని నీతిఅయోగ్ నివేదికే ప్రకటించింది. ప్రస్తుతం 6.1% నికి నిరుద్యోగం పెరిగింది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు శూన్యం. కనీసం నిరుద్యోగ సమాచారం కూడా లేకుండా మోడీ పాలన సాగుతోంది. మొత్తం బడ్జెట్‌లో వాగ్దానాలతో ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసింది తప్ప మౌలిక సమస్యలు పరిష్కారం కోసం చర్యలు లేవు.

(పెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి